# నేడు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌కు టీఆర్‌లు అప్పగింత

కాశీబుగ్గ, ఫిబ్రవరి 23: ఇటీవల సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు చేసిన క్రమంలో రైతులకు సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకాల ప్రకారం పత్తి సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తాత్కాలిక సర్టిఫికెట్ జారీ చేశారు. అందులో అవకతవకలు జరిగాయని వరంగల్ రీజినల్ పరిధిలో ఏడుగురు మార్కెట్ కార్యదర్శులను ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అలాగే, వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసి 15 రోజుల్లో వివరణతోపాటు సంబంధిత టెంపరరీ రిజిస్ట్రేషన్ (టీఆర్) సర్టిఫికెట్లు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. సస్పెండ్ అయిన ఏడుగురు మార్కెట్ కమిటీ కార్యదర్శులు సోమవారం హైదరాబాద్‌లోని మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌కు సంబంధిత పత్రాలు అందజేయనున్నట్లు సమాచారం.

**ముగ్గురు డేటా ఎంట్రీ ఆపరేటర్లపై వేటు**

వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురు డేటా ఎంట్రీ ఆపరేటర్లు పట్టాదారు పాస్‌పుస్తకాల ఎంపికలో అవకతవకలకు పాల్పడినట్లు తేలడంతో వారిపై వేటుపడే అవకాశం ఉంది. వ్యవసాయశాఖ అధికారులతోపాటు డేటా ఎంట్రీ ఆపరేటర్లు చేసిన తప్పులకు మార్కెట్ కార్యదర్శులు సస్పెండ్ కావడంతో ఆపరేటర్ల తప్పులను మార్కెటింగ్ శాఖ గుర్తించి ఈ నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తున్నది.



మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న అర్చకులు

## శివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వానం

దామెర, ఫిబ్రవరి 23: మండలంలోని ఊరుగొండ శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో జరిగే శివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, అర్చకులు ఆదివారం హనుమకొండలోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. శివరాత్రి 24వ తేదీన శివకల్యాణం, 25న స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, 26న మహాశివరాత్రి అర్చనలు జరుగుతాయని మాజీ ఎమ్మెల్యేకు అభివృద్ధి కమిటీ సభ్యులు, అర్చకులు వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోగుల సత్యనారాయణ రెడ్డి, కునాటి సునీల్‌రెడ్డి, కిరణ్‌రెడ్డి, అర్చకులు శ్రావణ్‌శర్మ పాల్గొన్నారు.

## చెక్‌పోస్టులు తనిఖీ చేసిన డీసీపీ



ఉప్పల్ చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న డీసీపీ సలీమా

కమలాపూర్, ఫిబ్రవరి 23: మండలంలోని అంబాల, ఉప్పల్ గ్రామాలోని భీంపల్లి క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టులను సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా ఆదివారం తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ వివరాల నమోదు రికార్డులను పరిశీలించారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అంబాల, నేరెళ్ల వాగులను పరిశీలించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. మండలంలోని భీంపల్లి శివారులో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు సీఐ హరికృష్ణ ఆదివారం తెలిపారు.

## ఆలిండియా సదస్సును జయప్రదం చేయండి

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 23: ఆర్‌ఎస్‌ఎస్ – బీజేపీ ఫాసిస్టు, కార్పొరేట్, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 28న ఢిల్లీలో జరిగే ఆలిండియా సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కామ్రేడ్ గడ్డం సదానందం తెలిపారు. సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ పార్టీ దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తోందని పేర్కొన్నారు. మోదీ 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' అని పలికి పదేళ్ల తర్వాత 'కార్పొరేట్ కా సాత్, కార్పొరేట్ కా వికాస్'గా మార్చేశారని అన్నారు. మోదీ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా కరపత్రాలు, పోస్టర్స్, సభలు, సమావేశాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

*Hema Motors needs Sales Executive: any Degree 2 wheeler must, Accountant: good Knowledge in Tally must and Min 1 to 2 Yrs of Exp in Automobile Dealership Walk in Interview with resume on 24th & 25th Feb 2025 between 11 am to 6.pm Cont: Hema Motors Pvt Ltd, Opp: Govt ITI, Mulugu Road, Wgl, Cell: 8008204442, 9154921942.
NTW-15465

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించి కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# రేషన్ డీలర్లపై చర్యలేవీ?

- ఇటీవల పట్టుబడిన పీడీఎస్ బియ్యం
- పట్టించుకోని సివిల్ సప్లై అధికారులు

కమలాపూర్, ఫిబ్రవరి 23: మండల కేంద్రంలోని లక్ష్మీ గణపతి ఫంక్షన్ హాల్, ఇటీవల అంబాలలో రేషన్ బియ్యం వరుసగా పట్టుబడుతున్నా సివిల్ సప్లై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. మండలంలో 35కు పైగా రేషన్ షాపులు ఉన్నాయి. ప్రతి నెల పీడీఎస్ బియ్యం రేషన్ షాపులకు వచ్చిన మూడు రోజుల్లోనే పక్కదారి పట్టిస్తూ అమ్ముకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. రేషన్ షాపుల నుంచే నేరుగా దళారులకు చేరుతున్నాయనే ప్రచారం జరుగుతున్నా నిఘా పెట్టి రేషన్ డీలర్లపై చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి.



కమలాపూర్ లక్ష్మీ గణపతి ఫంక్షన్ హాల్‌లో పట్టుబడిన రేషన్‌బియ్యం (ఫైల్)

నెలరోజుల క్రితం మండల కేంద్రానికి చెందిన రైస్‌మిల్లర్ ఫంక్షన్ హాల్‌లో రేషన్‌షాపుల గన్నీ సంచులతో 71 క్వింటాళ్లు పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. గన్నీ సంచులతో పట్టుబడిన రేషన్ బియ్యం ఏ రేషన్ షాపు నుంచి వచ్చాయి? పీడీఎస్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న రేషన్ డీలర్లు ఎవరనే దానిపై ఆరా తీయడంలేదు. దీంతో డీలర్లు దర్జాగా రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది. వారం రోజుల క్రితం అంబాల గ్రామంలో ఆటోట్రాలీలో 28క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ విషయమై సివిల్ సప్లై అధికారుల వివరణ కోసం ఫోన్ చేయగా స్పందించలేదు.

## నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ రద్దు

వరంగల్, ఫిబ్రవరి 23 : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో హనుమకొండ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ సెల్ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి వినతులు, ఫిర్యాదులు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావద్దని కోరారు. వచ్చే సోమవారం యథావిధిగా గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## నేడు బల్దియాలో 'గ్రీవెన్స్ సెల్'

వరంగల్, ఫిబ్రవరి 23 : మహా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు నగర ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధికారులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

## కవి అరుణ కీర్తికి అవార్డు ప్రదానం



అవార్డు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 23: ఖమ్మం జిల్లాలోని ఉదయ సాహితీ తెలంగాణ సాహిత్య వికాస వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉభయ తెలుగు రాష్ట్రాల సమావేశంలో వరంగల్ జిల్లాకు చెందిన ప్రముఖ గజల్ గాయని, కవి అరుణ కీర్తికి సహస్ర కవితా విభూషణ అవార్డును ప్రదానం చేశారు. సమకాలిన సమస్యలపై వేయికి పైగా రచనలు చేసినందుకు ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆమెకు అవార్డుతోపాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమెను వరంగల్, హనుమకొండ జిల్లాల కవులు, కళాకారులు అభినందించారు.



## మహా కుంభ మేళాలో దాస్యం దంపతులు

వరంగల్, ఫిబ్రవరి 23 : ప్రయాగ్‌రాజ్ మహా కుంభ మేళాకు బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయభాస్కర్ దంపతులు వెళ్లారు. ఆదివారం ప్రయాగ్‌రాజ్‌లోని గంగా, యమున, సరస్వతి నదుల త్రివేణి సంగమం వద్ద వారు పుణ్యస్నానం ఆచరించారు. సంగమం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

నదిలో పుణ్యస్నానం చేసిన దాస్యం దంపతులు

# భయమైతుంది.. లోపలికి పోను

**విద్యార్థికి ధైర్యం చెప్పి పరీక్ష కేంద్రంలోకి పంపిన పోలీసులు**

నయీంనగర్, ఫిబ్రవరి 23: పరీక్ష కేంద్రం వద్దకు వచ్చి 'నాకు భయమైతుంది. లోపలికి పోను' అంటూ ఏడుస్తున్న ఓ విద్యార్థికి పోలీసులు ధైర్యం చెప్పి పంపారు. సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆరో తరగతి నుంచి తొమ్మిది తరగతుల్లో ప్రవేశాల కోసం ఆదివారం అర్హత పరీక్ష జరిగింది. పలివేల్పుల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల పరీక్ష కేంద్రం వద్దకు తండ్రితో వచ్చిన ఓ విద్యార్థి తనకు భయమవుతోందని, పరీక్ష రాసేందుకు లోపలికి పోనని ఏడుస్తున్నాడు. పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, విధులు నిర్వర్తిస్తున్న కేయూసీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆ విద్యార్థిని బుజ్జగించి, ధైర్యం చెప్పి పరీక్షా కేంద్రంలోకి పంపారు. పోలీసుల చొరవకు అక్కడున్న విద్యార్థుల తల్లిదండ్రులు హ్యాట్సాఫ్ చెప్పారు.



విద్యార్థికి సర్ది చెబుతున్న హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, కేయూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్

# క్రూరమృగం దాడిలో పది మేకలు మృతి

ధర్మసాగర్, ఫిబ్రవరి 23: క్రూరమృగం దాడిలో పది మేకలు మృత్యువాత పడిన ఘటన మండలంలోని ఎలుకుర్తిలో శనివారం రాత్రి జరిగింది. మినుముల రమేశ్ వ్యవసాయ బావి వద్ద షెడ్ నిర్మించుకొని 20 మేకలు పెంచుతున్నాడు. మేకలను రోజూ మేతకు తోలుకెళ్లి సాయంత్రం షెడ్‌లో పంపిన తర్వాత ఇంటికి పోతాడు. ఈ క్రమంలో శనివారం మేకలను మేపి షెడ్‌లో తోలి ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం షెడ్ వద్దకు వెళ్లి చూడగా సుమారు పది మేకలు, నాలుగు కోడి పిల్లలు చనిపోయాయి. రాత్రి ఏదో క్రూరమృగం వచ్చి దాడి చేసిందని, తనకు సుమారు రూ.లక్ష వరకు నష్టపోయానని తెలిపాడు.



మృత్యువాత పడిన మేకలు






## సండే రష్


*జోరుగా చేపల విక్రయాలు*

సండే వచ్చిందంటే మాంసం ప్రియులకు నాన్‌వెజ్ ఉండాల్సిందే. దీంతో నగరంలో ఆదివారం మటన్, చేపల దుకాణాలు కిటకిటలాడాయి. సెలవు కావడంతో కాజీపేట పట్టణంలో ఆయా దుకాణాలు జనంతో రద్దీగా కనిపించాయి. – **కాజీపేట, ఫిబ్రవరి 23**

# 50 ఏళ్ల జ్ఞాపకాలు పదిలం..

- ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాయపర్తి, ఫిబ్రవరి 23: మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో 1974–75 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఎస్సెస్సీ పూర్తయి 50 ఏళ్లు గడిచిన సందర్భంగా పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట చేరారు. ఏడు పదుల వయస్సులో ఉన్న వారంతా నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులంతా తమ కుటుంబాలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. తర్వాత పూర్వ ఉపాధ్యాయుడు శ్రీరంగారావును సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆకుల నరేందర్‌రావు, నరోత్తంరావు, కొండపల్లి ప్రసాద్‌రావు, ఏ ప్రభాకర్‌రావు, సాంబయ్య, సుధాకర్, రాములు, గుంషావళి, సికిందర్, విజయ, సత్తయ్య, మహ్మద్ ఉస్మాన్, ఎల్లారెడ్డి, భిక్షపతి, రాంచంద్రారెడ్డి, యాదవరెడ్డి, గౌరయ్య, మహేందర్, లక్ష్మీనారాయణ, సిద్దంశెట్టి అప్పయ్య పాల్గొన్నారు.




శ్రీరంగారావును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలను గెలిపించుకుందాం

*బీసీ సంఘం నాయకులు*

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 23: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించాలని బీసీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సమావేశం జరిగింది. బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోనగాని యాదగిరి గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, మేర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్ల సంపత్‌కుమార్, బీసీ సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎదునూరి రాజమౌళి, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనగాని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీలకతీతంగా బీసీ అభ్యర్థి సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, రిటైర్డ్ డీఈవో చంద్రమోహన్, వెంకటస్వామి, రవీందర్‌కు మొదటి, రెండో ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చందా మల్లయ్య, కుమ్మరి సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కందికొండ వేణుగోపాల్, బీసీ సంక్షేమ సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్‌గౌడ్, బీసీ విద్యార్థి సంఘం కేయూ ఇన్‌చార్జి అరెగంటి నాగరాజు, బీసీ యువజన సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఏరుకొండ పవన్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు ఓడితల రాము, పంజాల మధు, పులి మోహన్, భీమన్న, గణేశ్, వినోద్ పాల్గొన్నారు. కాగా, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ మరిచిపోయి వేదిపైకి మేర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్ల సంపత్‌కుమార్‌ను ఆలస్యంగా పిలవడంతో అలిగారు. 'తెలంగాణ ఉద్యమం నుంచి ఇద్దరం కలిసి మెలిసి ఉన్నాం.. ఇప్పుడు ఎలా మరిచిపోతావు' అని ప్రశ్నించగా ఇద్దరు గొడవకు దిగుతారు. ఒకరినొకరు నువ్వెంత అంటే నువ్వెంత అనుకోవడంతో పలువురు సర్దిచెప్పారు. వేదిక ముందు వరుసలో కుర్చీలు లేక అడ్వకేట్ రాచకొండ ప్రవీణ్‌కుమార్ వెనుతిరిగిపోయారు.

# ఇంటర్ నిట్ హ్యాండ్‌బాల్ విజేత వరంగల్

**నిట్‌లో ముగిసిన క్రీడాపోటీలు**

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 23: నిట్‌లో ఇంటర్ నిట్ క్రీడాపోటీలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. వాలీబాల్, హ్యాండ్‌బాల్, యోగా క్రీడల కోసం ఇంటర్ నిట్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో దేశవ్యాప్తంగా వివిధ నిట్‌ల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ ప్రదర్శించారు. ఆటగాళ్ల కృషి, క్రీడా స్ఫూర్తి, జట్టు తత్వాన్ని ఈ పోటీలు మరింతగా ప్రోత్సహించాయి. కాగా, హ్యాండ్‌బాల్ పురుషుల విభాగంలో విజేతగా వరంగల్ నిట్ జట్టు, రన్నరప్‌గా నిట్ సురత్కల్, మహిళల విభాగంలో విజేత నిట్ రాయ్‌పూర్, రన్నరప్‌గా నిట్ త్రిచి, వాలీబాల్ పురుషుల విభాగంలో విజేతగా నిట్ కాలికట్ జట్టు, రన్నరప్‌గా నిట్ త్రిచి, మహిళల విభాగంలో విజేతగా నిట్ సురత్కల్, రన్నరప్ నిట్ కురుక్షేత్ర, యోగా పురుషుల విభాగంలో విజేతగా నిట్ రాయ్‌పూర్, రన్నరప్‌గా నిట్ జంషెడ్‌పూర్, మహిళల విభాగంలో విజేతగా నిట్ జంషెడ్ పూర్, రన్నరప్‌గా నిట్ కాలికట్ నిలిచారు. ముఖ్యఅతిథిగా నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి హాజరై విజేతలను అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ప్రొఫెసర్ డీ శ్రీనివాసాచార్య, సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఆక్టివిటీస్ హెడ్ ప్రొఫెసర్ పి.రవికుమార్ పాల్గొన్నారు.



మెన్స్ హ్యాండ్‌బాల్ విజేత వరంగల్ నిట్ విద్యార్థులు
బహుమతులు ప్రదానం చేస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

# వైద్యుడిపై దాడిఘటనలో దర్యాప్తు ముమ్మరం

- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు
- పక్కా ప్లాన్ ప్రకారమే హెల్మెట్లు ధరించి దాడి
- భార్యపై అనుమానం దిశగా విచారణ?

సుబేదారి, ఫిబ్రవరి 23: వరంగల్ నగరంలోని భట్టుపల్లి ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి వైద్యుడు సుమంత్ రెడ్డిపై హత్యాయత్నం ఘటనపై పోలీస్ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అందులో ప్రధాన నిందితుడిని కొడంగల్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పూర్తి స్థాయిలో పురోగతి సాధించినట్లు సమాచారం. ఈ ఘటనలో పోలీసు అధికారుల హద్దుల పంచాయితీపై సీపీ సీరియస్ అయ్యారు. వెంటనే నిందితులను పట్టుకోవాలని ఆదేశించగా మిల్స్‌కాలనీ, టాస్క్‌ఫోర్స్ పోలీస్ అధికారులు జాయింట్‌గా దర్యాప్తు ప్రారంభించారు. వైద్యుడిపై దాడికి పాల్పడిన వారు ఎవరనే కోణంలో ఆరా తీశారు. హెల్మెట్ ధరించిన ఇద్దరు వైద్యుడి కారును వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టినట్లు గుర్తించారు. ఒకే బైక్‌పై ఇద్దరు హెల్మెట్ ధరించి వచ్చి దాడి చేసిన విషయంలో కుట్ర కోణం ఉందని పోలీసులు అనుమానించారు. నిందితులు ఏ రూట్‌లో వచ్చారనేది సీసీ కెమెరాల ద్వారా తెలుసుకున్నారు. బైక్, నిందితుల దృశ్యాల ఆధారంగా ఇతర జిల్లాకు చెందిన వారుగా గుర్తించారు.

**భార్యపైనే అనుమానం?**

వైద్యుడు సుమంత్‌రెడ్డిపై నిందితులు పక్కా ప్లాన్‌తోనే దాడికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకొని విచారణ చేయగా ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. భార్యపై అనుమానంతో పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టినట్లు సమాచారం. పాన్డ్‌గా దాడి చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలినట్లు తెలిసింది. సుమంత్‌రెడ్డి కాజీపేటలోని తన క్లినిక్ నుంచి శుక్రవారం రాత్రి భట్టుపల్లి మీదుగా హంటర్‌రోడ్డులోని ఇంటికి కారులో వస్తుండగా, ప్రధాన నిందితుడితోపాటు పోలీసు కానిస్టేబులైన స్నేహితుడు హెల్మెట్ ధరించి బైక్‌పై కారును అనుసరిస్తూ వెనుక వచ్చి భట్టుపల్లి వద్ద ఢీకొట్టి, దాడికి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలినట్లు తెలిసింది. అతడు రక్తం మడుగులో పడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో చనిపోయినట్లు భావించిన తర్వాతే నిందితులు ఇద్దరు హైదరాబాద్‌కు పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. వైద్యుడు గతంలో సంగారెడ్డిలో క్లినిక్ నిర్వహించిన సమయంలో, అక్కడ జిమ్ సెంటర్‌లో అతడి భార్యకు ఓ వ్యక్తి పరిచయం కావడం, అతడే ఈ దాడికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో స్పష్టమైనట్లు సమాచారం. ప్రధాన నిందితుడు, కానిస్టేబుల్ అయిన అతడి స్నేహితుడు గుర్తుపట్టకుండా హెల్మెట్లు ధరించి దాడికి పాల్పడినట్లు తెలిసింది. ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని, వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని ప్రత్యేక విభాగంలో తమదైన స్టైల్‌లో విచారణ చేస్తున్నట్లు సమాచారం. నిందితులను ఒకటి, రెండు రోజుల్లో అరెస్ట్ చూపించి, వివరాలు వెల్లడించనున్నారు.

## పద్మాక్షిగుండంలో వ్యర్థాలు శుద్ధి

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 23: హనుమకొండ పద్మాక్షి గుండంలోని వ్యర్థాలు, చెత్తను శుద్ధి స్వచ్ఛంద సంస్థ క్లీన్ చేసింది. శుద్ధి ఆర్గనైజేషన్ సభ్యులు కాటం శ్రీకాంత్, పావని, దివ్య, చారి, వరుణ్, రాజేష్, పద్మాక్షి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కనుకుంట్ల రవికుమార్, అంబటి కుమార్‌స్వామి, గిరి, రాజయ్య, యు.పాపయ్య, ఆకుల కుమార్‌స్వామి పాల్గొన్నారు.



పద్మాక్షిగుండంలోని చెత్త తొలగించిన శుద్ధి స్వచ్ఛంద సంస్థ సభ్యులు

## నిత్యావసర సరుకులు అందజేత



నిత్యావసర సరుకులు, నగదు అందజేస్తున్న ఎస్సై సురేశ్

వేలేరు, ఫిబ్రవరి 23: మండలంలోని గుండ్లసాగర్‌లో టేకుల సమ్మయ్య ఇల్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకొని కాలిపోయింది. బాధితుడికి ఎస్సై అజ్మీరా సురేశ్ నిత్యావసర సరుకులు, రూ.2వేల ఆర్థిక సాయం అందించారు. కానిస్టేబుల్ ఉప్పలయ్య ఉన్నారు. కాగా, అంతకుముందు మల్లికుదుర్ల గట్టు మల్లికార్జునస్వామి స్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా స్వామివారికి పూజలు చేశారు.

## బావిలో పడి వ్యక్తి మృతి

ధర్మసాగర్, ఫిబ్రవరి 23: ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వృద్ధుడు బొడ్డు ఎలీయ తనకు ఉన్న మేకలు మేపుతూ జీవిస్తున్నాడు. ఆదివారం ఓ బావి వద్ద గడ్డి ఉండటంతో మేకలను తోలుకెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ఓ మేక జారీ బావిలో పడుతుండగా దాన్ని రక్షించే క్రమంలో జారి అందులో పడిపోయాడు. బావిలో నీళ్లు ఉండగా మునిగి ఈత రాక మృతిచెందాడు. మృతదేహం కోసం స్థానికులు బావిలోని నీటిని తోడేస్తున్నారు. రాత్రి కావడంతో వెనుదిరిగారు.

## సీఏలో స్టేషన్‌ఘన్‌పూర్‌వాసికి గోల్డ్ మెడల్


స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 23 : స్టేషన్ ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన వ్యక్తి సీఏలో జాతీయ స్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన పరకాల శ్రీనివాస్, సుకుమారి దంపతుల కుమారుడు పరకాల మణిశంకర్ చార్టెట్ అకౌటెంట్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల జరిగిన ఆల్ ఇండియా టెస్ట్‌లో మణిశంకర్ మొదటి స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించినట్లు కుటుంబ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఐసీఏఐ అధ్యక్షుడు సీఏ రంజిత్‌కుమార్ అగర్వాల్, ఐసీఏఐ ఉపాధ్యక్షులు సీఏ చరణ్ జోత్ సింగ్ నందా చేతుల మీదుగా మణిశంకర్ గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా మణిశంకర్‌ను స్థానికులు, స్నేహితులు అభినందించారు.

## 'పేరిణి' ప్రదర్శనకు కాకతీయుల వారసుడి ప్రశంసలు

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 23: కాకతీయ కాలంలో పేరొందిన పేరిణి నాట్య కళా ప్రదర్శనను కాకతీయ 22వ రాజవంశీయుడు కమల్ చంద్ర బంజ్‌దేవ్ ప్రశంసించారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రం బస్తర్ జిల్లా జగదల్‌పూర్‌లో శనివారం రాత్రి ఆయన పెళ్లి వేడుకలో ఓరుగల్లు నుంచి నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమీ అధినేత గజ్జెల రంజిత్‌కుమార్ బృందం పాల్గొంది. వారు కమల్‌చంద్ర బంజ్‌దేవ్ నుంచి ప్రశంసలు అందుకున్నారు.

## ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా

రాయపర్తి, ఫిబ్రవరి 23: పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నట్లు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు పోరండ్ల సమ్మయ్య కుమార్తె రమ్య వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం కొత్తూరు పరిధి గుంటూరుపల్లికి చెందిన పాతూరి శివరామయ్య దశదినకర్మకు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, పూస మధు, తోట నర్సింగం, గజవెల్లి ప్రసాద్, దొమ్మాటి సుభాష్, పాలెపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



శివరామయ్యకు నివాళులర్పిస్తున్న దయాకర్‌రావు